జములమ్మ సన్నిధిలో మాజీ మంత్రి కుటుంబ సభ్యులు

అమ్మవారికి పూజలు చేస్తున్న మాజీ మంత్రి కుటుంబ సభ్యులు

గద్వాల రూరల్, మే14 : నడిగడ్డ ఇలవేల్పు జములమ్మ దేవిని మంగళవారం మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ కుటుంబ సభ్యులు దర్శించుకున్నారు. ముందుగా ఆలయ ఈవో పురేందర్‌కుమార్ వారికి స్వాగతం పలికి సన్మానించారు. అనంతరం అర్చకులతో ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది మురళీధర్ రెడ్డి, సంజీవరెడ్డి, రవిప్రకాశ్ పాల్గొన్నారు.

అపనిందలు మాని అభివృద్ధిపై దృష్టి పెట్టాలి

- బీఆర్ఎస్ మీడియా జిల్లా కన్వీనర్ నందిమల్ల అశోక్

వనపర్తి టౌన్, మే14 : వనపర్తి ఎమ్మెల్యే ప్రతిపక్షాలపై అపనిందలు మాని అభివృద్ధిపై దృష్టి పెట్టాలని బీఆర్ఎస్ మీడియా జిల్లా కన్వీనర్ నందిమల్ల అశోక్ హిత వు పలికారు. జిల్లా కేంద్రంలోని మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ అంతర్గత పోరులో అల్లాడిపోతున్నామన్న ఎమ్మెల్యే కాంగ్రెస్ పార్టీ ఓట్లు బీజేపీకి మల్లాయన్న అక్కసుతో బీఆర్ఎస్‌పై ఆరోపణలు చేయడం తగదన్నారు. విలేకరుల సమావేశంలో ఎప్పుడు చెప్పిన మాటలే నియంత, అవినీతిపరుడు అని చెప్తున్న ఆయన అజ్ఞానాన్ని ప్రజలు గమనిస్తున్నారన్నారు. అదృష్టంతో ఎమ్మెల్యే అయిన మేఘారెడ్డి విమర్శలే అస్త్రంగా పనిచేస్తున్నారని విమర్శించారు. జూన్ 4న ఎన్నికల ఫలితాల్లో మెజార్టీ తగ్గితే ఎక్కడ పరువు పోతుందోనని ముందస్తుగానే అసత్య ప్రచారాలు చేస్తున్నారన్నారు. పోలింగ్ కేంద్రాల్లో బీఆర్ఎస్ ఏజెంట్లు, నాయకులు , కార్యకర్తలు ఏ కేంద్రంలో లేరో నిరూపించాలన్నారు. మున్సిపల్ కౌన్సిల్‌ను చీల్చి నైతికతకు తిలోదకాలు ఇచ్చారన్నారు.

మండల ప్రజలకు కృతజ్ఞతలు

- ఎంపీపీ జన్ను పద్మావతి

మదనాపురం, మే 14 : పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా సోమవారం మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన ప్రజలు ప్రశాంత వాతావరణంలో ఓటుహక్కు వినియోగించుకున్నందుకు ఎంపీపీ జన్ను పద్మావతీ వెంకట్‌నారాయణ దంపతులు మంగళవారం ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు. బతుకుదెరువుకోసం ఇతర ప్రాంతాలకు వలసవెళ్లిన వారు కూడా స్వచ్ఛందంగా వచ్చి ఓటువేశారన్నారు.

ఎలాంటి గొడవలు లేకుండా పోలింగ్‌కు సహకరించిన పోలీస్ సిబ్బంది, వివిధ శాఖల అధికారులకు ఎంపీపీ కృతజ్ఞతలు తెలిపారు.

ఎంబీ మహాసభల పోస్టర్ల ఆవిష్కరణ

మహాసభలపోస్టర్‌ను విడుదల చేస్తున్న ఎంబీ కన్వెన్షన్ సభ్యులు

గద్వాల రూరల్, మే 14 : గద్వాల పట్టణంలోని రూరల్ పోలీస్‌స్టేషన్ ఎదురుగా ఉన్న కేఎస్ ఫంక్షన్‌హాల్‌లో ఈనెల 16వ తేదీ నుంచి నాలుగు రోజులు పాటు ఎంబీ మహాసభలు నిర్వహిస్తున్నట్లు స్థానిక ఎంబీ చర్చిల ప్రతినిధులు మంగళవారం ప్రకటనలో తెలిపారు.ఈ మహాసభలకు ముఖ్య ప్రసంగికులుగా జోసఫ్ కిశోర్, పాస్టర్ యిర్మియా, డాక్టర్ భాస్కర్, డాక్టర్ విజయ భూషణం పాల్గొంటారన్నారు. అనంతరం కేఎస్ ఫంక్షన్ హాల్‌లో మహాసభలకు సంబంధించిన వాల్‌పోస్టర్‌లను విడుదల చేశారు. కార్యక్రమంలో సైమ సుధాకర్, ప్రకాశ్, ప్రభుదాస్, అబ్రహం, తిమ్మన్న, రవి ప్రకాష్, అజయ్, మాణిక్యం, పురేందర్, రంజిత్ పాల్గొన్నారు.

భగీరథ పైప్‌లైన్ లీకేజీ

- పట్టించుకోని అధికారులు

గువ్వలదిన్నె శివారులో లీకేజీ అవుతున్న మిషన్‌భగీరథ పైప్‌లైన్

కేటీదొడ్డి, మే 14 : వేసవిలో తాగునీరు దొరకక ప్రజలు ఇబ్బందులు పడుతుంటే.. పైప్‌లైన్ లీకేజీ అయ్యి మిషన్ భగీరథ నీరు రెండు రోజులుగా వృథాగా పారుతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. ఈ ఘటన మండలంలోని గువ్వలదిన్నె గ్రామంలో చోటు చేసుకున్నది. గువ్వలదిన్నె నుంచి కేటీదొడ్డికి వెళ్లే రహదారిలో మిషన్ భగీరథ పైప్‌లైన్ లీకేజీతో నీళ్లన్నీ రోడ్డుపై వృథాగా పారుతున్నాయి. ఈ విషయంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నీళ్లులేక ఇబ్బందులు పడుతుంటే పైపు లీకేజి పట్టించుకోవట్లేదని, బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఇలాంటి ఘటనలు జరిగితే సంబంధిత అధికారులకు భయం ఉండేదని ఇప్పుడు ఎవరూ పట్టించుకోవట్లేదని అంటున్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

RECRUITMENT
★Pen, Pencil Company, Educated, Unemployed Girls/Boys, Male/Female, House Wife Earn 24500-64500 Packing Work at Home 9034548725, 9728230253
NT-3277

ప్రకటన
క్లాసిఫైడ్ ప్రకటనలు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

To Book your Classified
4 lines Advt
Rs. 200/-
Only (B/W)
Additional Line
50/- Only
For Advertisement Enquiry
Please Contact...
9182777641
9182777654
9182777794

అక్రమ కట్టడాలకు అడ్డేది.?

- పట్టించుకోని అధికారులు
- అండగా నిలుస్తున్న రాజకీయ నాయకులు
- రూ.కోట్ల విలువైన ప్రభుత్వ స్థలాలు కబ్జా

గద్వాల టౌన్, మే 14 : అక్రమ నిర్మాణాలను సహించేది లేదు.. అనుమతి లేకుండా నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తీసుకుంటాం...ఆక్రమ దారులు ఎంతటి వారైనా వదిలేది లేదు.. అంటూ అధికారులు ఆవేశంగా ఇచ్చే ప్రకటనలు..కబ్జాలకు మేము వ్యతిరేకం..మా పార్టీ వారైనా.. ప్రతిపక్షమైనా..ఇంకెవరైనా అక్రమాలకు పాల్పడితే అధికారులకు పూర్తిగా సహకరించి చర్యలు తీసుకునేందుకు సహాయ పడతామంటూ రాజకీయ నాయకులు చేసే ప్రకటనలకు..ఉపన్యాలకు ఎక్కడ పొంతన లేకుండా పోతోంది. ఎందుకనుకుంటున్నారా...మున్సిపాలిటీ పరిధిలో కోట్ల విలువైన స్థలాలను కబ్జా చేసి నిర్మాణాలు చేపడుతుంటే అది తెలిసినా పట్టించుకోని అధికారులు ఉండడం...అందుకు రాజకీయ నాయకుల సహకారం.. వెరసి ప్రభుత్వానికి పెద్ద గండి..

గద్వాల మున్సిపాలిటీ పరిధిలో ఈ మధ్య అక్రమ నిర్మాణాలు వేగవంతమయ్యాయి. తమ పార్టీ అధికారంలోకి వచ్చిందని కొందరు...తమ చైర్మన్ పార్టీ మారాడు ఇంకే ముంది కబ్జా చేస్తే పోలా అంటూ మరికొందరు ఇలా కబ్జాలకు తెగపడుతున్నారు. జిల్లా కేంద్రంలోని కిష్టారెడ్డి బంగ్లా సమీపాన ఉన్న పెద్ద డ్రైనేజీ పక్కన అక్రమంగా దుకాణాల నిర్మాణం చేపట్టారు. గతంలో అక్కడ మున్సిపాలిటీ ఇంజినీయర్ విభాగానికి సంబంధించిన కార్యాలయం ఉండేది. రోడ్డు విస్తరణలో దానిని తొలగించడంతో ఆ స్థలం ఖాళీగా ఉండిపోయింది. ఇంకేముంది ఆ పక్కనున్న షావుకారు కన్నుపడింది. ఆ స్థలాన్ని కూడా తన ఖాతాలో వేసుకుంటే

కిష్టారెడ్డి బంగ్లా వద్ద అక్రమంగా చేపట్టిన నిర్మాణం

అయిపోతుందనుకున్నాడేమో వెంటనే నిర్మాణాలు చేపట్టాడు. అలాగే మెయిన్ బజారులో ఇదే విధంగా ప్రభుత్వ స్థలాన్ని కబ్జా చేసుకున్నాడోవ్యక్తి. ఇది తెలుసుకున్న అధికారులు నోటి మాట నోటీసులు ఇచ్చి చేతులు దులుపుకొన్నారు. ఆ షావుకారులు మాత్రం తమ పంతం తమదే అన్నట్లు నాయకులు తమకు అండగా ఉన్నారు.. అధికారులు ఏమి చేస్తారులే అన్నట్లుగా నిర్మాణాలను కొనసాగిస్తున్నారు. కానీ అధికారులు తమ కండ్ల ముందు కోట్ల విలువైన స్థలాలు కబ్జాకు గురవుతున్నా ఏమీ చేయలేని నిస్సాహాయ స్థితిలో ఉండడం శోచనీయం. కబ్జాలను నమస్తే తెలంగాణతో పాటు పలు పత్రికలు అధికారులు దృష్టికి తెచ్చినా పట్టించుకోకపోవడంపై వారికి ఏ మేర ముట్టాయో నన్న అనుమానాలు రాకపోలేవు. కలెక్టర్, అదనపు కలెక్టర్, మున్సిపల్ కమిషనర్ ఇలా అన్ని శాఖల అధికారులున్నా ఫలితమేమి అని ప్రజలు విస్మయానికి గురువుతున్నారు. సామాన్య ప్రజలు రెండడుగులు నిబంధనలకు విరుద్ధంగానో... అదనంగా నిర్మాణాలు చేపడితే తక్కున వాలిపోయి కూలగొట్టే అధికారులు ఇప్పుడు ఎక్కడికి పోయారని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా తమ విధులను సక్రమంగా నిర్వహించి సామాన్య ప్రజలకు న్యాయం చేస్తూ కోట్ల విలువైన ప్రభుత్వ భూములను కాపాడాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్న అభిప్రాయాన్ని ప్రజలు వ్యక్తం చేస్తున్నారు.

చర్యలు తీసుకుంటాం

అక్రమ నిర్మాణాలు చేపడుతున్న మాట వాస్తవం. ఇది వరకే మా దృష్టికి వచ్చింది. వెంటనే సదరు వ్యక్తులకు నోటీ సులు ఇచ్చి పనులు నిలివివేశాం. మళ్లీ నిర్మాణాలు చేపడు తున్నట్లు సమాచారం అందింది. వెంటనే చర్యలు తీసుకుంటాం.

– శంకర్‌సింగ్, మున్సిపల్ కమిషనర్

పట్టుదలకు మారుపేరు భగీరథుడు

- ప్రణాళికా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి
- ఘనంగా భగీరథ జయంతి
- పాల్గొన్న ఎమ్మెల్యే మేఘారెడ్డి, సగర సంఘం నాయకులు

వనపర్తి టౌన్, మే 14 : మనిషికి పట్టుదల ఉంటే సాధించలేనిదంటూ ఏమి లేదని మహనీయుడు భగీరథుడు నిరూపించాడని ప్రణాళికా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి అన్నారు. మంగళవారం భగీరథ జయంతిని పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని కొత్తకోట రోడ్డులో ఉన్న భగీరథ విగ్రహానికి రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి, ఎమ్మెల్యే మేఘారెడ్డి వేర్వేరుగా పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ కృషికి , ప్రయత్నానికి భగీరథుడు మారుపేరని, సంకల్పం ఉంటే సాధించలేనిదంటూ ఏది లేదని అన్నారు. మహానుభావుల కృషి యువత ఆదర్శంగా తీసుకొని అద్భుతాలు సృష్టించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా సగర సంఘం అధ్యక్షుడు తిరుపతయ్య, సంఘం నేతలు వాకిటి శ్రీధర్, మురళీసాగర్, శ్రీను, నాగేంద్రం, గోవర్ధన్, చీర్ల జనార్దన్, కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

భగీరథుడి స్ఫూర్తితో ముందుకు సాగాలి

గట్టు, మే 14 : పట్టుదలకు మారుపేరైన భగీరథుడి స్ఫూర్తితో ప్రతి సగరుడు ముందుకు సాగాలని సగర సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు, రిటైర్డ్ ఎంఈవో ఉప్పరి సత్యనారాయణ పిలుపునిచ్చారు. సగర సంఘం గట్టు కమిటీ ఆధ్వర్యంలో గట్టులో భగీరథ మహర్షి జయంతిని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భగీరథుడి చిత్రపటానికి పూలమాల వేసి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో సత్యనారాయణ మాట్లాడుతూ మనిషికి నాగరితకు నేర్పింది సగర జాతియే అన్న విషయాన్ని ఎవరూ మరువొద్దన్నారు. దివి నుంచి భువికి గంగను తీసుకొచ్చిన భగీరథ మహర్షిని ఎల్లకాలం గుర్తుంచుకోవాలన్నారు. సగరులు అన్నిరంగాల్లో రాణించాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం సగరులను బీసీ 'డీ' గ్రూపు నుంచి 'ఏ'లోకి మార్చాలని కోరారు. కార్యక్రమంలో సగర సంఘం నాయకులు యుసీ గోవిందప్ప, హోటల్ వెంకటేశ్, తంగలగడ్డ శ్రీనివాసులు, మెడికల్ రవి, వీరేశ్‌సాగర్, వెంకటేశ్, ఉప్పరి నర్సింహులు, వైకుంఠం, మహదేవ్, అంపయ్య, డిష్ నర్సింహులు, ఉరుకుంది, వివిధ పార్టీల నాయకులు రమేశ్, నాగప్ప, నరసింహులు, దేవన్న తదితరులు పాల్గొన్నారు.

భగీరథుని విగ్రహానికి నివాళులర్పిస్తున్న ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి

మల్దకల్‌లో..

మల్దకల్, మే 14 : మండల కేంద్రంలో సగర సంఘం ఆధ్వర్యంలో భగీరథ మహర్షి జయంతి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి ప్రత్యేక పూజలు చేశారు. ప్రతిఒక్కరూ భగీరథుడి బాటలోనే నడవాలని సూచించారు. కార్యక్రమంలో సగర సంఘం నాయకులు ఉప్పరి మనోహర్, వనంబావి రాముడు, ముక్కెర నాగరాజు, కృష్ణమూర్తి, శ్రీను, ప్రతాప్, రాముడు, తిరుమల్, ఈరన్న, కులపెద్దలు పాల్గొన్నారు.

ధరూర్‌లో..

ధరూరు, మే 14 : భగీరథ మహర్షి జయంతి వేడుకలను సగర సంఘ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. మండలంలోని మాల్‌దొడ్డి గ్రామంలో ఉప్పర కులస్తులు భగీరథ మహర్షి చిత్రపటానికి పూలమాల వేసి శుభాకాంక్షలు తెలుపుకున్నారు. భగీరథ మహర్షి సర్వ మానవాళి సౌభ్రాతృత్వం కోసం చేసిన కృషిని కొనియాడారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల కన్వీనర్ అంజిసాగర్, సగర సంఘ నాయకులు నర్సింహ, శ్రీరాములు, గోపాల్, భీమేశ్, మునెప్ప, వీరేశ్ పాల్గొన్నారు.

ఎర్రవల్లిలో..

ఎర్రవల్లి చౌరస్తా, మే 14: ఎర్రవల్లి మండల కేంద్రంలో మాజీ సర్పంచ్ రవి, బీఆర్ఎస్ నాయకుల ఆధ్వర్యంలో మంగళవారం భగీరథమహర్షి జయంతి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భగీరథుడి చిత్రపటానికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో రాగన్న, రవి, రాముడు, రవి, రఘు, గోపీ, దశరథంసాగర్ ఆంజనేయులు, రాజేశ్, వెంట్‌రాములు, జమ్మన్న, పరుశసాగర్, శివ, చిరుసాగర్, గ్రామస్తులు పాల్గొన్నారు.

పెబ్బేరులో..

పెబ్బేరు, మే 14: పెబ్బేరులో మంగళవారం భగీరథ మహర్షి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్థానిక గాంధీనగర్‌లోని భగీరథుని విగ్రహం వద్ద మండల సగర సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు. సామాజికవేత్త ఏబీజే సత్యంసాగర్ ఆధ్వర్యంలో జరిగిన వేడుకకు పెద్ద ఎత్తున ప్రజలు హాజరయ్యారు. కార్యక్రమంలో గుంటి శ్రీనివాసులు, రాజసాగర్, సురేశ్, సుభాశ్ పాల్గొన్నారు.

పాన్‌గల్‌లో..

పాన్‌గల్, మే 14 : మండలంలోని కొత్తపేట గ్రామంలో భగీరథుడి జయంతి వేడుకలను సగరసంఘం జిల్లా అధ్యక్షుడు తిరుపతయ్యసాగర్ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా భగీరథుడు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ కృషి, ప్రయత్నానికి భగీరథుడు మారుపేరని, గట్టి సంకల్పం ఉంటే సాధించని దేమీ లేదన్నారు. మహానుభావుల కృషిని యువత ఆదర్శంగా తీసుకొని అద్భుతాలు సృష్టించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కిరణ్‌కుమార్‌సాగర్, తిరుమల్ యాదవ్, రాజేందర్ పాల్గొన్నారు.



వనపర్తిలో నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే మేఘారెడ్డి



గట్టులో నివాళులర్పిస్తున్న సగర సంఘం నాయకులు

ధరూర్‌లో నివాళులర్పిస్తున్న సగర సంఘం నాయకులు

పల్లెల్లో జోరుగా 'ఉపాధి' పనులు

- జల సంరక్షణ పనులకు ప్రాధాన్యం
- మొక్కల సంరక్షణకు చర్యలు

అయిజ మండలం కొత్తపల్లిలో ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీలు

అయిజ, మే 14 : పల్లెల్లో ఉపాధి హామీ పథకం పనులు జోరుగా సాగుతున్నాయి. వలసల నివారణకు ఎన్ఆర్ఈజీఎస్ కింద జాబ్‌కార్డులు కలిగిన ప్రతి ఒక్కరికీ ఉపాధి కల్పిస్తున్నారు. మండలంలోని 28గ్రామ పంచాయతీలలో జాబ్‌కార్డులు కలిగిన కూలీలకు పనులు కల్పించేందుకు ఈజీఎస్ సిబ్బంది చర్యలు తీసుకున్నారు. మండలంలో 17,380మందికి జాబ్‌కార్డులు ఉండగా ప్రస్తుతం 6,277 మంది ఉపాధి పనులు చేస్తున్నారు. ప్రధానంగా జల సంరక్షణ పనులకు ప్రాధాన్యత కల్పిస్తున్నారు. నీటి కుంటలు, ఫాం ఫండ్స్ నిర్మాణ పనులు, కాల్వలు, చెరువుల్లో పూడికతీత పనులు చేపడుతున్నారు. వేసవి దృష్ట్యా ఉదయం వేళల్లోనే పనులు చేపడుతున్నారు. మండలంలో ఉత్తనూరు, టీటీదొడ్డి, పులికల్, ఉప్పల, సింధనూరు, కుటుకనూర్, మేడికొండ, రాజాపూర్, బైనపల్లి, కొత్తపల్లి, భూంపురం, ఉప్పల క్యాంపు తదితర గ్రామాల్లో పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. కూలీలకు వెంటనే డబ్బులు చెల్లించేలా మస్టర్లను సిద్ధం చేసి ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు.

మొక్కల సంరక్షణకు ప్రాధాన్యం

మండలంలో వలసల నివారణకు ఉపాధి హామీ పనులు చేపడుతున్నాం. కూలీల సంఖ్యను పెంచేందుకు ఎప్పటికప్పుడు సిబ్బందికి ఆదేశాలు ఇస్తున్నాం. వేసవి దృష్ట్యా కూలీలకు నీడకోసం టెంట్లు, ఓఆర్ఎస్ పాకెట్లను అందుబాటులో ఉంచుతున్నాం. స్వయంశక్తి సంఘాల్లో సభ్యత్వం కలిగిన ప్రతి ఒక్కరికీ పని కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. హరితహారంలో నాటిన మొక్కలకు నీటిని అందించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. వేసవిలో మొక్కల సంరక్షణకు తగు ప్రాధాన్యత కల్పిస్తున్నాం.

–వెంకటయ్య, ఎంపీడీవో, అయిజ

పాన్‌గల్‌లో మోస్తరు వర్షం

పాన్‌గల్, మే 14: మండల కేంద్రంతో పాటు కేతేపల్లి, వెంగళాయిపల్లి, అన్నారం, దవాజీపల్లి గ్రామాల్లో మంగళవారం చిన్నపాటి వర్షం కురిసింది. దీంతో ఒక్కసారిగా వాతావరణం చల్లబడింది. ఉక్కపోత నుంచి జనాలకు కొంత ఉపశమనం కలిగింది. వరిధాన్యం తడిచిపోవడంతో రైతులు కొంత ఇబ్బంది పడ్డారు.

నేటి నుంచి సీయూఈటీ

ఎర్రవల్లి చౌరస్తా, మే 14: మండలంలోని సరస్వతి పాఠశాలలో బుధవారం నుంచి సీయూఈటీ (సెంట్రల్ యూనివర్సిటీ ఎంట్రన్స్ టెస్ట్) జరుగనుందని ఎగ్జామ్ కో ఆర్డినేటర్ వెంకటేశ్వరావు మంగళవారం ప్రకటనలో తెలిపారు. పరీక్షా18వ తేదీ వరకు ఉదయం 9:30నుంచి సాయంత్రం 6:30వరకు షిఫ్ట్‌వైజ్‌గా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అభ్యర్థులు ఎలాంటి ఎలక్ట్రానిక్ వస్తువులు వెంట తీసుకురావొద్దని పేర్కొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

వనపర్తి టౌన్, మే 14 : కార్పొరేట్ జూనియర్ కళాశాలలో ప్రవేశాల కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఎస్సీ వెల్ఫేర్ అధికారిణి నుశిత మంగళవారం ప్రకటనలో తెలిపారు. 2024–25 విద్యా సంవత్సరానికి పదో తరగతిలో జీపీఏ 7.0 పైగా సాధించిన ఎస్సీ, ఎస్టీ , బీసీ , మైనార్టీ, పీహెచ్‌సీ విద్యార్థులు వెబ్‌సైట్ https:// telanganaepass. cgg. gov.in లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాల, గురుకుల పాఠశాల, ఎయిడెడ్ పాఠశాల, బెస్ట్ అవేలబుల్ పాఠశాల, నవోదయ పాఠశాల, ఆదర్శ, కేజీబీవీల్లో చదివిన విద్యార్థులు మాత్రమే అర్హులని, ఈనెల 15 నుంచి 30వ తేదీ లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

రైలు కింద పడి యువకుడి ఆత్మహత్య

గద్వాల అర్బన్, మే 14 : యువకుడు రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన జిల్లా కేంద్రంలో చేసుకున్నది. రైల్వే హెడ్ కానిస్టేబుల్ రామకృష్ణ కథనం ప్రకారం రైలు పట్టాల మీద మృతదేహం ఉందన్న స్థానికుల సమాచారం మేరకు ఘటనా స్థలానికి చేరుకొని ఆరా తీసినట్లు తెలిపారు. జిల్లా కేంద్రంలోని బీసీ కాలనీకి చెందిన మహ్మద్ మౌలాలీ(26) కార బండి వ్యాపారం చేస్తూ జీవనం సాగించేవాడు. మౌలాలీ తల్లి పదేండ్ల కిందట అనారోగ్యంతో మృతి చెందింది.అప్పటి నుంచి మానసికంగా కృంగి మద్యానికి బానిసై జీవితంపై విరక్తి చెంది మంగళవారం పాత హౌసింగ్ బోర్డు సమీపంలో ఉన్న రైల్వే పట్టాల మీద ఎదురుగా వస్తున్న రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు ఆయన తెలిపారు. మృతుడికి భార్య మహబూబ్ బీ కూతురు, కూమారుడు ఉన్నారు.

మతిస్థిమితం లేని వ్యక్తి మృతి

ధరూరు, మే 14 : మతిస్థిమితం లేని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన మండల కేంద్రంలో చోటు చేసుకున్నదని ఎస్సై విజయ్‌కుమార్ తెలిపారు. మండల కేంద్రంలో రెండేండ్లుగా భిక్షాటన చేస్తూ మతి స్థిమితం లేకుండా తిరుగుతున్న వ్యక్తి మంగళవారం బైపాస్ కూడలిలో అస్వస్థతకు గురై మృతి చెందాడన్నారు. విషయం స్థానికులు గమనించి ఎస్సైకు సమాచారం అందించగా, ఘటనాస్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతుడిని ఎవరైనా గురిస్తే ఎస్సై 87126 70293 నెంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు.

విద్యుదాఘాతంతో గడ్డి దగ్ధం

గోపాల్‌పేట, మే 14 : విద్యుదాఘాతంతో ట్రాక్టర్‌పై తీసుకెళ్తున్న గడ్డి దగ్ధమైన ఘటన మండలంలోని ఏదుట్లలో చోటు చేసుకున్నది. గ్రామస్తుల కథనం మేరకు..మంగళవారం గ్రామానికి చెందిన వెంకటేశ్వర్‌రావు అదే గ్రామానికి చెందిన గలగారి శేషయ్యకు చెందిన ట్రాక్టర్‌లో గడ్డి లోడ్ చేసుకొని నాగేశ్వర్‌రావు పొలం దాటుతున్న క్రమంలో విద్యుత్ వైర్లు ట్రాక్టర్‌పై ఉన్న గడ్డికి తాకాయి. దీంతో గడ్డికి మంటలు అంటుకొంది. చుట్టుపక్కల వారు వెంటనే ట్రాక్టర్ ట్రాలీ నుంచి ఇంజిన్‌ను వేరు చేసి, ఫైర్ ఇంజిన్‌కు సమాచారం ఇచ్చారు. ఫైరింజన్ వచ్చి మంటలు ఆర్పినా ఫలితం లేకుండా పోయింది. అప్పటికే గడ్డి పూర్తిగా కాలిపోయి జరగాల్సిన నష్టం జరిగిపోయింది. ఈ ఘటనలో ట్రాలీ పాక్షికంగా దెబ్బతిన్నది.

క్రీడాశిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

నాగర్‌కర్నూల్, మే 14: క్రీడాశిక్షణ కోర్సులకు నిర్వహించే ప్రవేశ పరీక్షకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి సీతారాం మంగళవారం ప్రకటనలో తెలిపారు. యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వశాఖ భారత ప్రభుత్వం ఆధ్వర్యంలో లక్ష్మీబాయి నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్(గ్వాలియర్)లో పీజీ(పీజీడీఎస్‌సీ), డిప్లొమా స్పోర్ట్స్ కోర్సు కోచింగ్ (డీఎస్‌సీ), ఇతర కోర్సుల్లో ప్రవేశానికి జూన్ 20వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలని, 25న పరీక్ష ఉంటుందన్నారు.